క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

దామెర : వ్యక్తిపై పోక్సో కేసు నమోదైన సంఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన 17 సంవత్సరాల బాలికను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని తీసుకెళ్లాడు. కాగా బాలిక తల్లిదండ్రులు ఈ విషయమై ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బాలిక వాంగ్మూలం మేరకు పెళ్లి చేసుకున్న వ్యక్తిపై పోక్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పరకాల ఏసీపీ సతీశ్‌బాబు కేసు విచారిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

12న ఓంకార్ శత జయంతి

వరంగల్ చౌరస్తా : మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంసీపీఐ(యూ) నగర నాయకులు నర్ర ప్రతాప్, ఐతమ్ నాగేష్‌లు తెలిపారు. శనివారం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఓంకార్ భవన్‌లో శత జయంతికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాలి ప్రభాకర్, అప్పనపురి నరసన్న, జటబోయిన నర్సయ్య, రాయినేని ఐలన్న, మల్లికార్జున్, శివ పాల్గొన్నారు.

క్రిస్టియన్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో శనివారం గ్రేటర్ వరంగల్ క్రిస్టియన్ ఫెలోషిప్ జనరల్ బాడీ సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక, పదవీ స్వీకార సమర్పణ కార్యక్రమాన్ని ప్రార్థనాత్మక వాతావరణంలో నిర్వహించారు. అధ్యక్షుడు పాల్ ముస్తఫా, బిషప్ డేనియల్ కళ్యాణపుల నాయకత్వంలో ఎన్నికలు ఏకాభిప్రాయంతో నిర్వహించినట్లు వెల్లడించారు. అధ్యక్షుడిగా ప్రవీణ్ ప్రభు సుధీర్, ఉపాధ్యక్షులుగా కాకిలేటి అబ్రహం, లోయిన్ జాన్‌బన్నీ ,ప్రధాన కార్యదర్శిగా జాన్సన్ ప్రసాద్, కార్యదర్శిగా సుప్రియా సర్వేశ్, సహాయ కార్యదర్శులుగా అశోక్‌పాల్, సీతయ్య పోలేపాక, ప్రవీణ్ జాన్, కోశాధికారిగా ఎన్.పావని, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కార్యవర్గం క్రైస్తవ సమాజానికి ఆశాజ్యోతి లాంటిదిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బార్‌కు అనుమతి ఇవ్వొద్దు

హసన్‌పర్తి : ఎర్రగట్టు జంక్షన్ వద్ద కొత్తగా రెస్టారెంట్ అండ్ బార్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని స్థానికులు కోరారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం జనవాసాల మధ్య బార్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని స్థానికులు కోరగా ఎమ్మెల్యే నాగరాజు స్పందించి ఎక్సైజ్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించాకే అనుమతి ఇవ్వాలని ఆదేశించారు.

జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



న్యూశాయంపేట : దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడని భారతీయ ఖేల్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు ఒక ప్రకటనలో అన్నారు. మురళీనాయక్‌కు వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

హసన్‌పర్తి: దేశ రక్షణలో వీర మరణం పొందిన మురళీనాయక్ ఆత్మశాంతికై కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శనివారం రాత్రి ఎర్రగట్టు గుట్ట జంక్షన్ వద్ద మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పోగొట్టుకున్న బంగారు ఆభరణాల అందజేత



మడికొండ : బంగారు ఆభరణాలను పోగొట్టుకున్న మహిళకు మడికొండ పోలీసులు అప్పగించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మడికొండ సీఐ కిషన్ కథనం ప్రకారం. కాజీపేట మండలం మడికొండకు చెందిన బండారి రాధిక వ్యక్తిగత పనుల నిమిత్తం మడికొండ నుంచి హనుమకొండకు శనివారం ఉదయం 11 గంటలకు ఆటోలో వెళ్లి ఆటో దిగిన తర్వాత తన పర్సును ఆటోలో మరిచిపోయినట్లు గమనించింది. పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు గోవర్ధన్, శ్రవణ్‌లను అప్రమత్తం చేయగా ఆటోను గుర్తించి పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను స్వాధీనపరచుకుని మహిళకు అప్పగించినట్లు తెలిపారు. పర్సులో 2 తులాల బంగారు గొలుసు, చెవి కమ్మలు రూ.2 లక్షల విలువుంటాయని తెలిపారు.

కార్యాలయాల ఏర్పాటు ఎప్పుడో..?



ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి (ఫైల్)

- పేరుకే మండలం, అభివృద్ధికి ఆమడ దూరం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నడికూడ : గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసినప్పుడు కొత్త మండలాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కానీ అభివృద్ధి మాత్రం శూన్యమనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరకాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మండలాల సంఖ్యను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం.. నడికూడను 14 గ్రామాలతో నూతన మండలంగా ఏర్పాటు చేసింది. కానీ సొంత భవనాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలకు మోక్షం లభించడం లేదు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయగా, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. గత సంవత్సరం ఆగస్టులో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయం పక్కన గల ప్రభుత్వ భూములను పరిశీలించి ఆరోగ్య ఉపకేంద్రం, పోలీస్ స్టేషన్, ఏంపీడీఓ కార్యాలయాల ఏర్పాటుకు స్థల సేకరణ పరిశీలించారు. వెంటనే హద్దులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించగా, అధికారులు చదును చేశారు. కానీ తొమ్మిది నెలలు గడుస్తున్నా అక్కడ ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో మండల ప్రజలు అధికారులు, పాలకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



మండల ప్రజల కోరిక మేరకు ఎంపీడీఓ కార్యాలయం తాత్కాలిక ప్రతిపాదనతో మా పాఠశాల భవనం ఇచ్చాం. పక్కన ఉన్న హైస్కూల్లో మాకు రెండు గదులు కేటాయించినా విద్యార్థులకు, మాకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా పాఠశాల భవనాన్ని అప్పగించాలని కోరుతున్నాం.

- దుప్పటి కృపా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నడికూడ

తొమ్మిదేళ్లు గడుస్తున్నాయి..



మండలం ఏర్పాటై తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదు. వివిధ ప్రభుత్వ సేవల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు చొరవ చూపి కార్యాలయాల ఏర్పాటుతో పాటు మండల అభివృద్ధికి పాటుపడాలి. అలాగే బ్యాంకు సేవలను ప్రారంభించాలి.

- వరికెల కిషన్‌రావు, నర్సక్కపల్లి

హమాలీల ధర్నాను జయప్రదం చేయండి



కమలాపూర్ : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చక్రపాణి

కమలాపూర్ : హమాలీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని హనుమకొండ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఆయన హమాలీలతో కలిసి ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. తాడుకట్టు మామూళ్లు ఇవ్వడం లేదని, ప్రభుత్వం చెప్పడంతో రైతులకు, హమాలీలకు గొడవలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వమే నేరుగా బస్తాకు రూ.70 చొప్పున ఇవ్వాలని, ప్రభుత్వం హమాలీలకు గుర్తింపు కార్డులతో పాటు ఏడాదికి రెండు జతల బట్టలు, ప్రమాద బీమా సౌకర్యం, ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలని, 50 ఏళ్లు పైబడిన హమాలీలకు రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ మండల నాయకులు తిరుపతి, సుదర్శన్, రవి, అనిల్, విజేందర్, ఐలయ్య, రాజు, పోచాలు, సతీశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవం

దామెర : మండలంలోని ఊరుగొండ శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి శిఖర జీర్ణోద్ధారణ కలశ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నృసింహస్వామి జయంతిని పురస్కరించుకుని స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, కల్యాణ మహోత్సవం, విశ్వక్సేన పూజ, అంకురార్పణ, సుదర్శన కలశ గ్రామ శోభయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 12వ తేదీన సోమవారం పుణ్యవచనం, పంచగవ్య ప్రాశనం, యాగశాల ప్రవేశం, దేవతాహ్వానం, అగ్ని ప్రతిష్ఠ, పంచపల్లవ సహిత జలాధివాసం కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. 13న మంగళవారం మంటపార్చన, హోమాలు, మహాన్నపన విధి, ప్రసాద స్నపన విధి, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పాధివాసం నిర్వహిస్తామన్నారు. 14న బుధవారం రత్న న్యాపం, ధాతున్యాసం, బీజన్యాసం ఉదయం 9.9 గంటలకు పంచలోహ సహిత శ్రీ సుదర్శన శిఖర కలశ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

33 కేవీ విద్యుత్ లైన్ మార్చాలని వినతి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్ : మండలంలోని శనిగరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను మార్చాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఏఈ రాములుకు శనివారం వినతిపత్రం అందించారు. గ్రామంలో 11 కేవీ వైరుతో విద్యుత్ లైన్ ఉందని, ఆ స్థానంలో 33 కేవీ విద్యుత్ లైన్ వేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది పనులు ప్రారంభించగా స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కరెంట్ షాక్‌కు గురై ఇప్పటికే పలువురు గ్రామస్తులు గాయపడినట్లు తెలిపారు. గ్రామ ప్రజల భద్రతా దృష్ట్యా 33 కేవీ విద్యుత్ లైన్‌ను గ్రామం చివరి నుంచి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్క అశోక్, దాసరి కోటి, మహ్మద్ సలీం, సంగెం తిరుపతయ్య, మిట్టపల్లి జగదీశ్వర్, బండి రాజుతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

కాజీపేట : ఆటోలో మరిచిపోయిన బ్యాగును తిరిగి బాధితుడికి అందించి ఓ ఆటోడ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. శనివారం మధ్యాహ్నం ములుగు జిల్లా పస్రాకు చెందిన దీపక శ్రీరామ్ ఫాతిమానగర్ అడ్డాపై ఆటోలో ఎక్కి హనుమకొండ బస్టాండ్‌లో దిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఆటోలో బ్యాగు కనిపించడంతో ఆటో డ్రైవర్ బెడిగా జగదీశ్వర్ నేరుగా ఫాతిమానగర్ అడ్డాపై విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అప్పగించాడు. బ్యాగులో ఉన్న సమాచారం మేరకు బాధితుడికి ఫోన్ చేసి రప్పించి ట్రాఫిక్ ఎస్సై రావెళ్ల రామారావు చేతుల మీదుగా బ్యాగును అందజేశారు. బ్యాగులో రూ.2 వేల నగదు, విలువైన కాగితాలు ఉన్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్‌ను ఎస్సై అభినందించారు.

అద్దాలు తీసి చూడు.. అభివృద్ధి కనిపిస్తుంది

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు


హసన్‌పర్తి : దృతరాష్ట్రుడిలా నల్లటి కళ్లద్దాలు పెట్టుకుని మాట్లాడకు.. జర ఆ అద్దాలు తీసి చూడు అభివృద్ధి–సంక్షేమం కనిపిస్తుందని మాజీ మంత్రి దయాకర్‌రావును ఉద్దేశించి ఎమ్మెల్యే నాగరాజు కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి లేదని, సన్నధాన్యాలు కొనుగోలు చేయడం, బోనస్ ఇవ్వడం లేదని దయాకర్‌రావు వ్యాఖ్యానించడంపై ఎమ్మెల్యే నాగరాజు స్పందించారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి ఇంట్లో శనివారం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు అన్ని సెంటర్లలో ధాన్యం కొనుగోలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఇప్పటికీ ఈవిషయం మాజీ మంత్రికీ తెలియదన్నారు. సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వడం లేదని కేవలం బీఆర్ఎస్ వాళ్లే మాట్లాడారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుపై ప్రతి రోజు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు తగు సూచనలు ఇస్తున్నారని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి దయాకర్‌రావులకు బోనస్ రాకుంటే ఎవరికీ రానట్లా అని ప్రశ్నించారు. బంగారు తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మదన్‌గౌడ్, భగత్, శ్రీరాం,దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆర్మీ విభాగం కేడెట్లకు అభినందన

కేయూ క్యాంపస్ : హసన్‌పర్తిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో ఈనెల 1 నుంచి 10 వరకు 10వ బెటాలియన్ ఎన్‌సీసీ వారు నిర్వహించిన ఏటీసీ వార్షిక శిక్షణ క్యాంపునకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఎన్‌సీసీ ఆర్మీ విభాగం కేడెట్స్ పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారిలో సాయిచందన, జీవన్‌కుమార్, ఉత్తమ డ్రిల్‌లో వెంకటరమణ, టగ్ ఆఫ్ వార్‌లో మొదటి స్థానం సాధించిన స్రవంతి, వెంకటరమణ, మౌ ని క తదితరులున్నారు. వీరిని ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, ఎన్‌సీసీ ఆర్మీ విభాగం అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి అభినందించారు.

సైన్యానికి అండగా 140 కోట్ల ప్రజలు


- బీజేపీ సీనియర్ నేత, ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి

హన్మకొండ : భారత సైన్యానికి అండగా 140 కోట్ల ప్రజలు ఉన్నారని బీజేపీ సీనియర్ నాయకుడు, జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. శనివారం హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అధ్యక్షతన సంఘటన, సంరచన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ జాతీయ నాయకత్వం ఇచ్చిన ఆదేశాల నియమాల ప్రకారం ప్రతి పోలింగ్ బూత్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీని పోలింగ్ బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని అన్నారు. బీజేపీకి రోజు రోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్నింటిలో విఫలమైందని విమర్శించారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోష్, కాచం గురుప్రసాద్, దాస్యం అభినవ్‌భాస్కర్, కూతురు రాజు, సర్కెట శ్రీనివాస్‌రావు, మండల డివిజన్ కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్ బోర్డుల తొలగింపు



వరంగల్ అర్బన్ : నగరంలోని ప్రధాన రహదారుల్లో ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న, చొచ్చుకొచ్చిన సైన్ బోర్డుల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం రాంపూర్ నుంచి కాజీపేట వరకు సు మారు 500 మేర తొలగించినట్లు బల్దియా ఏసీపీ తెలిపారు. కాజీపేట వరకు మెయిన్ రోడ్డులో సుమారు 500 సైన్ బోర్డులను శనివారం తొలగించినట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇర్షాద్ తెలిపారు. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో సైన్ బోర్డులు, అడ్వర్టైజ్మెంట్ బోర్డులు తొలగించనున్నట్లు తెలిపారు. గతంలో పలుమార్లు తొలగించాలని నోటీసులు జారీ చేసినా యాజమానులు, వ్యాపారులు ముందుకు రావడం లేదన్నారు. టీపీఓ రజిత, తదితరులు ఉన్నారు.

తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గరుడ పటాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకుడు కృష్ణమాచార్యులు

శాయంపేట : మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీమత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం వేద మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, యాగ్నికులు వీరవెల్లి వేణుగోపాలచార్యులు అంకురారోహణం, ఆరాధన, రక్షాబంధన పూజ నిర్వహించారు. అనంతరం ధ్వజారోహం, గరుడ పటం ఆవిష్కరించి గరుడ ముద్ర ప్రసాదాన్ని సంతానం లేని దంపతులకు, భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్వర్, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్‌సేనారెడ్డి, వినుకొండ శంకరాచారి, దిండిగాల వంశీ, మామిడి ప్రమోద్, కాంబత్తుల ప్రకాశ్, మంత్రి చందు, గిద్దమారి సురేశ్, నడిగొట్టు సాంబయ్య, మహిళలు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

పొటాషియం వినియోగించి యూరియాను తగ్గించాలి



ఐనవోలు : మాట్లాడుతున్న వీరన్న



వేలేరు : మాట్లాడుతున్న డాక్టర్ ఉమారెడ్డి

ఐనవోలు : పంట సాగులో పొటాషియం వినియోగించి యూరియా వాడకాన్ని తగ్గించాలని శాస్త్రవేత్తలు జి.వీరన్న, ఆర్ శ్రవణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వనమాలకనపర్తి గ్రామంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వారు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వీరన్న, శ్రవణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. రైతులు ఇష్టారీతిన రసాయన ఎరువులను, పురుగు మందులను వినియోగించకుండా సాగు ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు ఖరీదు చేసిన అనంతరం రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. పంట మార్పిడి ద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగం పెంచుకోవాలని అవగాహన కల్పించారు. కాగా రైతులు అడిగిన పలు ప్రశ్నలు, సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఏఓ సీహెచ్.సునీల్‌కుమార్, ఏఈఓ అఫ్రీన్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

వేలేరు : రైతులు అవసరం మేరకే ఎరువులు వినియోగించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియాను అవసరం మేరకే వాడాలని అన్నారు. తక్కువ యూరియాతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని అన్నారు. రైతులు పంట మార్పిడిని తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. నీటిని అవసరం మేరకే వాడాలని, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ కవిత, ఏఈఓ శిల్పా, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్‌లను ఆశ్రయించిన ప్రేమజంట

- కూతురిని కొట్టినందుకు తల్లి, కుటుంబ సభ్యులపై కేసు



ఇరు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

శాయంపేట : ప్రేమించుకున్నారు.. గుడిలో పెళ్లి చేసుకున్నారు.. తల్లిదండ్రుల నుంచి ఆపాయం ఉందని, రక్షణ కల్పించాలని పోలీస్‌లను ఆశ్రయించారు. ఈ క్రమంలో కూతురుపై కోపంతో తల్లి చేయిచేసుకుంది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటన శాయంపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. దుగ్గొండి మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన మేదరి శృతి శాయంపేట మండల కేంద్రానికి చెందిన అంబాల రామకృష్ణ శుక్రవారం ఇల్లంతకుంట రామాలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. కాగా తమకు అమ్మాయి తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించాలని శాయంపేట పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రేమవివాహం చేసుకున్న అమ్మాయి తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను సీఐ రంజిత్‌రావు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చే క్రమంలో అమ్మాయి తల్లి 'నువ్వు ఇంత పని చేశావంటూ' కూతురు శృతిని పోలీస్ స్టేషన్‌లోనే చేయిచేసుకుంది. దీంతో ఇరు వర్గాలు మధ్య తోపులాట జరిగింది. కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. సీఐ రంజిత్‌రావు సిబ్బందితో ఇరు వర్గాలను చెదరగొట్టారు. ప్రేమ వివాహం చేసుకున్న అమ్మాయిని పోలీస్ స్టేషన్‌లో కొట్టినందుకు బాధితురాలు శృతి ఫిర్యాదు మేరకు తల్లి భారతి, తండ్రి మొగిలి, సోదరులు వంశీ, నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గడువులోగా భూ సమస్యల పరిష్కారం

- తహసీల్దార్ నాగరాజు



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

నడికూడ : గడువులోగా భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ నాగరాజు అన్నారు. మండలంలోని కంఠాత్మకూరు, వరికోల్ గ్రామాల్లో శనివారం భూ భారతి చట్టంపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హనమకొండ జిల్లా నుంచి భూ భారతి పోర్టల్ పైలట్ ప్రాజెక్టుగా నడికూడ మండలం ఎంపికైనట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రెవెన్యూ సదస్సు విజయవంతం చేసినట్లు చెప్పారు. ఈనెల 5 నుంచి వివిధ గ్రామాల నుంచి భూ సమస్యలపై స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భూ భారతి చట్టం ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామని, భూ సమస్యలపై కంఠాత్మకూరు 221, వరికోల్ 124 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పాదయాత్ర



కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ మాలధారులు

కమలాపూర్ : భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా మండలంలోని తీగల బావి వద్ద విడిది చేసిన హనుమాన్ మాలదారులు శనివారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పహెల్గాం దాడికి ప్రతి చర్యగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న భారత సైనికులకు హనుమాన్ ఆశీస్సులతో మరింత బలం చేకూరి శత్రు సైనికులు భారతదేశం వైపు కన్నెత్తి చూడకుండా చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. భారత మహిళలు అత్యంత పవిత్రంగా భావించే సిందూరాన్ని వారికి దూరం చేసిన ఉగ్రవాదులపై ప్రతికారం తీర్చుకుని ఏ దేశమైనా భారత్ వైపు చూడాలంటే వెన్నులో వణుకు పుట్టేలా భారత సైనికులకు బలం చేకూర్చాలని హనుమాన్‌ను వేడుకుంటున్నామన్నారు. భారత దేశ రక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో మాలధారులు మౌటం రంజిత్, కాల్వ కుమారస్వామి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.